# విమల వివాహం ★


రచయిత :

ఏకా వెంకటరామ శేషగిరిరావు.


విమల పడకకుర్చీలో మేనువాల్చి తన వివాహసమస్యనుగూర్చి దీర్ఘంగా ఆలోచించ సాగింది. ఎన్నాళ్ళు ఆలోచించినా అది తేలే సమస్యగా తోచలేదు. మధూ, మురళీ యిద్దరూ చిన్నతనంనుంచీ విమలతో ఒకే స్కూల్లో చదువుకున్నవాళ్ళే! తెలివితేటల్లో, అందచందాల్లో ఆస్తిపాస్తుల్లో సమానులే! ఇద్దరూ విమలను గాఢంగా ప్రేమించినట్లు ఆమెకు తోచింది. సుందోపసుందుల్లాగా పోరాడి ప్రేమకు బలి అవటానికి కూడా సంసిద్ధులైనట్లు కూడా ఆమె గ్రహించింది. మధూ, మురళీలమధ్య ఉన్న చిరకాల స్నేహం చెడటానికి కూడా విమల కారణమైంది. వాళ్ళిద్దరికీ విమలను వివాహం చేసుకొనేవిషయంలో పోటీపడ్డది. విమలకుకూడా యిద్దరంటే యిష్టమే.

విమలపైకి ఎటువంటి చింతా, చీకూ లేని మనిషిలాగా కనపడ్డా, లోపలమటుకు ఈ సమస్యతోనే కుమిలిపోసాగింది. రాత్రింబవళ్ళు యిదే ఆందోళన. విమల కృష్ణారావుకు ఏకైకపుత్రిక. విమల భూమిమీద పడ్డప్పటినుంచీ తల్లీ, తండ్రీ కృష్ణారావే! కృష్ణారావు ధనవంతుడైనా పునర్వివాహాన్ని తలపెట్టలేదు. ఆధునికపద్ధతులమీద నవనాగరికురాలుగా తయారుచెయ్యాలనే ఆశయంతో బి. ఏ. దాకా చదువు చెప్పించాడు విమలకు. చదువుకుతోడు చక్కదనంతో విమల ఎంతమందినో ఆకర్షించింది. అప్పటికే విమలకు ఇరవై ఏళ్ళు పైబడి ఉంటాన పెళ్ళిచెయ్యకుండా ఉంచటానికి యిష్టంలేక ఎన్నో మంచి సంబంధాలను తీసుకవచ్చాడు. పిల్ల అందరికీ నచ్చింది కానీ విమలమాత్రం నా కెవ్వరూ నచ్చలేదంది. పైగా యిప్పట్లో పెళ్ళిమాట తలపెట్టవద్దని కూడా తండ్రితో మొహమోట పడకుండా చెప్పింది. సరే! నీ యిష్టం అని కృష్ణారావు పెళ్ళిప్రయత్నాన్ని విరమించుకున్నాడు. చిరునవ్వు చిందులుత్రొక్కే ఆమె వదనం వాడి విషాదరేఖలు ప్రస్ఫుటం కావటం చూసి కృష్ణారావు ఎందుకా అని అనుమానపడ్డాడు. ఇదివరలో ఎక్కడికి పోయి వస్తున్నా సంతోషంతో స్వాగతమిస్తూ రోజూ కులాసాకబుర్లతో తండ్రిని సంతోషపెట్టే విమల నీరసించి పేలవంగా తయారు కావటం కృష్ణారావుకు హృదయసంక్షోభమును రేకెత్తించింది.

ఒకరోజు కృష్ణారావు విమల దగ్గరచేరి ‘అమ్మాయీ! ఎందుకలా అర్థంకాని ఆందోళనతో మనస్సును పాడుచేసుకుంటావు. నీవు యీవిధంగా నిరుత్సాహంగా ఉండటంవలన నామనస్సు ఎంతగా బాధపడుతోందో చెప్పలేను. నీ అభ్యుదయాన్ని వాంఛించి పెళ్ళి చేసుకోకుండా కాలాన్ని దుర్భరంగా గడుపుతున్నాను. నా సర్వస్వం నీవే నని ఈనాటికైనా గ్రహించు. నీ హృదయాన్ని కలవరపెట్టే సంగతి ఏదైనా ఉంటే నిర్భయంగా బైటపెట్టు, సంతోషిస్తాను. తండ్రి హృదయాన్ని గ్రహించిన విమల అసలు సంగతి బైటపెట్టందే లాభం లేదని తండ్రితో తన మనోవాంఛను తెలియపరచింది. మనస్సులో ఉన్న అభిప్రాయాన్ని కప్పిపుచ్చి యిప్పట్లో పెళ్ళి అవసరం లేదని మొండిపట్టుపట్టిన విమల పెళ్ళిచేసుకోటానికి అంగీకరించటం సంఘానికి వెరిచే కృష్ణారావుకు సంతోషజనకమయింది. సరే! ఈరాత్రి ఆలోచించి రేపు ప్రొద్దునకల్లా ఏ సంగతీ తేల్చిచెపుతానని వెళ్ళిపడుకున్నాడు. కృష్ణారావు కళ్ళు మూశాడు కాని నిద్రపట్టిందికాదు. ఆలోచించగా ఆలోచించగా చక్కటి ఉపాయం తట్టింది. ఆ ఉపాయం ఈ క్లిష్టసమస్యను పరిష్కరించగలదనే ధైర్యం చేకూరింది.

మర్నాడు విమలను మధూ, మురళీ ఊళ్ళో ఉన్నారా అని అడిగాడు. ప్రస్తుతం ఊళ్ళో లేరు, వేసవి శలవలకు స్వగ్రామాలకు వెళ్ళారంది విమల. అయితే వాళ్ళ యడ్రసులు తెలిస్తే వ్రాసియివ్వమని అడిగాడు. మధూ, మురళీలకు చెరో ఉత్తరం వ్రాసి పోస్టుచేశాడు. ఆ ఉత్తరాల్లో వ్రాసిన సంగతులు కూతురుకు బహిర్గతంచెయ్యకుండా గోప్యంగా వుంచాడు.

మూడోరోజుకల్లా మధుదగ్గరనుంచి ఒక కవరు కృష్ణారావుకు అందింది.

విమలా !

నీవు స్ఫోటకంతో బాధపడ్డావన్న సంగతి ఉత్తరంద్వారా తెలుసుకున్నపుడు నా హృదయం ఎంత ఉద్వేగంచెందిందో వర్ణించలేను. నీ సౌందర్యవదనం పూర్వశోభను గోల్పోయిందనీ, నిన్ను చూడాలని పరితపిస్తోందనీ మీనాయన వ్రాశారు. కానీ విమలా! ఒకటిమాత్రం గ్రహించు. హృదయాలు వేరు కానపుడు తక్కిన విషయాలు ఎటువంటి చలనత్వాన్ని ప్రకోపించవు. త్వరలో వచ్చి నిన్ను కలుసుకుంటాను. నీ సున్నిత హృదయంలో నేను సంపాయించుకున్న స్థానం అలాగే ఉండిపోవాలని నా ఆశయం. నిన్ను వివాహమాడటానికి వేరే అభ్యంతరం ఎట్టి అవాంతరాలు సంభవించినా ఉండబోదు.

ఇట్లు

నీ ప్రేమికుడు

మధు.

ఆ ఉత్తరాన్ని దాచివుంచి మరో ఉత్తరానికి ఎదురుచూశాడు. నాల్గోరోజున మురళి వ్రాసిన లేఖ చేరింది.

విమలా !

ఇంతలో అనుకోకుండా యింత మార్పును పరమేశ్వరుడు నీకు కల్పిస్తాడని కలలోనైనా అనుకోలేదు. మావాళ్ళు వేరే సంబంధం నిశ్చయించి పెళ్ళిచేయాలని పట్టుబట్టి బలవంతం చేస్తున్నారు. నీవు ఎంతమాత్రం నా విషయంలో ఆశపెట్టుకోవద్దు.

ఇట్లు

నీ మిత్రుడు

మురళి.

రెండు లేఖలనూ చదివి తండ్రి విమలకు యిచ్చాడు. రెండు ఉత్తరాలనూ చదివింది. గాఢంగా ప్రేమించి హృదయాన్ని అర్పించిన

మధు సహృదయానికీ, నిష్కళంకమైన ప్రేమకూ, భౌతికసౌందర్యపుపై పైమెరుగుల చూసి ఆశించి పెళ్ళిచేసుకోటానికి కపట ప్రేమను ప్రకటించిన మురళికీ ఎంత వ్యత్యాసము అని అనుకున్నది.

ఎన్నాళ్ళనుంచో బాధాజనకంగా ఉన్న క్లిష్టసమస్యను ఒకరాత్రిలోనే తేల్చగల్గావే అంది తండ్రితో విమల.

అదృష్టంగా చక్కటి ఉపాయం స్ఫురించిందన్నాడు తండ్రి.

శుభముహూర్తం నిశ్చయించి మధు తండ్రికి కృష్ణారావు ఉత్తరం వ్రాశాడు. విమలకూ మధుకూ వైభవంగా వివాహం జరిగింది. పెండ్లి కూడావిడిలో విమలను పరీక్షగ చూడలేకపోయాడు. వివాహానంతరం పీటల మీదినుంచి లేచింతర్వాత విమలను చూచాడు. విమల అదివరకన్నా ఎంతో అందంగా నూత్నశోభతో కళకళలాడటం చూసి మధు ఆశ్చర్యపడ్డాడు.

ఉత్తరంలో మీనాయన అలా వ్రాశారేం అని అన్నాడు మధు విమలతో.

ఔను! మీహృదయాన్నీ, మురళి హృదయాన్నీ ఆలేఖలద్వారా పరీక్షించారు. ఆ పరీక్షలో మీరే నెగ్గినవారైనారు. మురళి హృదయం లేనివాడని తేలింది. పైపై మెరుగులు ఉన్నన్నాళ్ళూ స్త్రీని సుఖపెట్టి మార్పురాంగానే విడచిపెట్టే నీచులు సంఘంలో లేరంటారా? వాళ్ళకు హృదయార్పణ శక్తి ఉండదు. అంది విమల మధుతో! అది నిజమే అని అంగీకరించాడు మధు.

వేసవి సెలవలయిన తర్వాత మురళి తిరిగి కాలేజీలో చేరటానికి వచ్చాడు. విమలను చూసి నివ్వెరపోయాడు. ఉత్తరంలో వర్ణించబడ్డది ఈ విమలేనా అని దిగ్భ్రాంతిచెందాడు. ఇది పరీక్షా వివాహం అయిఉంటుందని, మధుకిచ్చిచేశారని తెలిసినప్పుడు తన దుర్బలత్వానికి చింతించాడు మురళి.

---



# * విరహవేదన *

చెన్నూరి వెంకటస్వామి.

●

గున్నమామిడినెక్కి-
లేజివుళ్ళనెక్కి-
మత్తెక్కి - పొగరెక్కి-
'కుహు - కుహుల' రవమెత్తి
కిన్నెరల శ్రుతిగల్పి
సారించు నీ - గీతి
చాలించుమో కోయిలా!
నాగుండె బ్రద్దలయ్యెను
కోయిలా!

కలువల రేడ!—నీ
కరముల స్పృశియించి
కలువకన్నియ అలుక
తీర్చుచు నున్నావ?
పండువెన్నెలపోసి
హసియించుచున్నావ?
తారకావళి నడుమ
తారాడు - చంద్రుడా!
చాలించు - నీ నవ్వు
చాలించుమో చంద్రుడా!
నేనింక తాళజాలను
చంద్రుడా!

ప్రియుడు భ్రమరానికి
కుసుమ కన్నియలంపు
కమ్మని తావుల
కానుకలందించుచూ
దూతికావృత్తినీ
గడుపు ఓ - పవనుడా!
చాలించుమా - యింక
చల్లనిగాడ్పులు
చాలించుమా - పవనుడా!
నే నింక - సహియించనో
పవనుడా!

నారాజు లేడింట
మీపొత్తు - నాకొద్దు
విరహతాపజ్వాల
న్నను మాడ్చి వేయొద్దు!